సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 17 । జూలై । 2024



నిధుల గోల్‌మాల్..?

నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం అందజేసిన నిధుల్లో గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. - 8లో



'కేవీకే' సేవలు అవసరం

కేవీకే సేవలు రైతాంగానికి చాలా అవసరమని నల్లగొండ జిల్లా కోర్టు జడ్జి ఎం.నాగరాజు అన్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం
30°/ 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి తొలి ఏకాదశి శుభాకాంక్షలు

నల్లగొండ : జిల్లా ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలకరితో తోడుగా వచ్చే తొలిఏకాదశి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను తీసుకువస్తుందన్నారు.

త్యాగాలకు గుర్తు.. మొహర్రం

ముస్లింలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాలకు గుర్తుగా జరుపుకునే పండగ మొహర్రం అన్నారు. లౌకికవాద స్ఫూర్తికి మొహర్రం తార్కాణంగా నిలుస్తుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పడుగను జరుపుకోవాలని కోరారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆకుపూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజ నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడుసేవ వంటి పూజలు నిర్వహించారు.

వార్డెన్ పోస్టు భర్తీచేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వలిగొండ : మండలంలోని లోతుకుంటలో గల ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో వార్డెన్ పోస్టును భర్తీ చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వసతిగృహంలో ఖాళీగా ఉన్న వార్డెన్‌పోస్టును భర్తీ చేయాలని, ఇన్‌చార్జ్ వార్డెన్ పర్యవేక్షణ లోపంగా వ్యవహరిస్తున్నందున ఎస్‌ఓను సస్పెండ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో బుగ్గ ఉదయ్‌కిరణ్, వంశీ, నరేందర్, ఫర్దీన్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితంగా ఉండాలి

చౌటుప్పల్ : హక్కుల సాధన కోసం రవాణా రంగానికి చెందిన కార్మికులు సంఘటితంగా ఉండాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.పాషా తెలిపారు. పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగిన ఆంథోల్ మైసమ్మ మినీ గూడ్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27, 28తేదీల్లో రామన్నపేటలో నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జొన్నకంటి దేవయ్య, నంధీశ్వర్, దాసు, వెంకటేశం, గురువయ్య పాల్గొన్నారు.

'మా హాస్టల్‌లోకి కేజీబీవీ విద్యార్థినులను రానివ్వం'

వేములపల్లి : కేజీబీవీ విద్యార్థినులను తమ హాస్టల్‌లోకి తరలించవద్దంటూ రెండో రోజు మంగళవారం ఆదర్శ పాఠశాల విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీకి చెందిన సుమారు 250 మంది విద్యార్థినులను తమ హాస్టల్ ప్రాంగణానికి తరలించినట్లయితే ఒక్కో గదిలో 30 నుంచి 35 మంది ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. దీనివల్ల తరగతులకు సకాలంలో వెళ్లక చదువులో వెనుకబడే ప్రమాదం ఉంటుందన్నారు. కేజీబీవీ విద్యార్థినులను వేరో చోట బిల్డింగ్ నిర్మించి తరలిస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవి.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణమాఫీపై ముందడుగు

- విధి విధానాలు ఖరారు చేసిన ప్రభుత్వం
- 18నుంచి ప్రారంభం కానున్న ప్రక్రియ
- జిల్లాలో 1.36 లక్షల మంది అర్హులు
- తెల్లరేషన్ కార్డు నిబంధనపై పలువురు రైతుల నుంచి వ్యతిరేకత
- ఎలాంటి నిబంధనలు లేకుండా ఏకకాలంలో చేయాలని బీజేపీ ఆందోళన

సాక్షి,యాదాద్రి: ఇచ్చిన హామీ మేరకు రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఆగస్టు 15లోపు పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయగా.. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం విడుదల చేశారు. ఈనెల 18 నుంచి ప్రక్రియ ప్రారంభించనున్నారు. ముందుగా రూ.లక్ష వరకు రుణమాఫీ చేయనున్నారు. అయితే తెల్ల రేషన్ కార్డు, రూ.2 లక్షలకు మించి రుణం ఉంటే ఆపైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందన్న నిబంధన పెట్టడంతో రైతుల్లో చర్చ జరుగుతోంది. పలువురు రైతులు నిబంధనలను వ్యతిరేకిస్తుండగా.. ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని బీజేపీ జిల్లాలో మంగళవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు విధించొద్దని డిమాండ్ చేస్తున్నారు.



జిల్లాలో 1.36 లక్షల మంది రైతులు

జిల్లాలో 1.36 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉన్నట్లు సమాచారం. అయితే వీరందరికీ రుణమాఫీ వర్తిస్తుందా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. తెల్లరేషన్‌కార్డు లింక్‌పై పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు లేకుండా గులాబి రేషన్‌కార్డు ఉన్న రైతులు కూడా పంట రుణాలు తీసుకున్నారు. తాజా నిబంధనల ప్రకారం రుణమాఫీ విషయంలో వారికి స్పష్టత లేదు.

అర్హుల జాబితా సిద్ధం

ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రావడంతో రుణమాఫీ అర్హుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల ఇలా వివిధ రకాలుగా రైతులు రుణాలు తీసుకున్నారు. ఈ క్రమంలో గైడ్ లైన్స్ ప్రకారం పంటరుణాలు తీసుకున్న లబ్ధిదారులు తుది జాబితా సిద్ధం చేశారు.

రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా రుణమాఫీ చేయాలి



రుణమాఫీపై ప్రభుత్వ మార్గదర్శకాలు రైతులకు అనుకూలంగా లేవు. రైతు రుణమాఫీకి, రేషన్ కార్డుకు లింక్ పెడుతున్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రూ.2లక్షలు ఉన్న రుణం ఉన్న ప్రతి రైతుకూ మాఫీ వర్తింపచేయాలి. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ మాఫీ చేస్తామని చెప్పింది. ఇప్పుడు మార్గదర్శకాల పేరుతో రైతులను మోసం చేస్తున్నట్లుగా ఉంది.

– యాస ఇంద్రారెడ్డి, ఆత్మకూరు(ఎం)

నిబంధనల పేరుతో జాప్యం చేయొద్దు



నిబంధనల పేరుతో జాప్యం చేయొద్దు. పాత రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలి. బ్యాంకులు పాత అప్పుల కింద జమ చేసుకోకుండా చూడాలి. రైతు రుణమాఫీ ఆలస్యం చేయకుండా వెంటనే చేస్తే రైతులకు వడ్డీలు తప్పుతాయి.

– పురుషోత్తంరెడ్డి, బట్టుగూడెం రైతు

టీ డయాగ్నోస్టిక్ హబ్‌కు 16వ స్థానం

- ఉత్తమ సేవలకు గుర్తింపు
- రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు సకాలంలో ఫలితాల వెల్లడి

భువనగిరి: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీ డయాగ్నోస్టిక్ హబ్ 21 ఆరోగ్య కేంద్రాలకు ఉత్తమ సేవలు అందిస్తూ గుర్తింపు పొందుతోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ టీ డయాగ్నోస్టిక్‌ల పర్ఫామెన్స్‌ను ప్రతినెలా ప్రకటిస్తుంది. గత నెలలో ప్రకటించిన ఈ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 16వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు సకాలంలో ఫలితాలు అందజేయడం. జిల్లాకు గత కొద్ది నెలల నుంచి మెరుగైన గుర్తింపుతో రాష్ట్ర స్థాయిలో నిలుస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాతో పాల్చికుంటే 16వ స్థాయిలో ఉండగా 2023లో ప్రారంభించిన 11 టీ హాబ్‌లలో మాత్రం 5వ స్థానంలో ఉంది.

అధునిక పరికాలతో..

జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలో 2023 సెప్టెంబర్‌లో టీ డయాగ్నోస్టిక్ హబ్‌ను ప్రారంభించారు. ఈ హబ్‌లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. సరిపడా సిబ్బంది ఉండటంతో బీపీ, షుగర్, మూత్రపిండాలు, కాలేయం, గుండె, థైరాయిడ్, రక్త నమూనాలు, చికున్‌గున్యా, డెంగ్యూ, పలు రకాల జబ్బులకు ఉచితంగా పరీక్షలు చేసి ఫలితాలు వెల్లడిస్తున్నారు.

24 గంటలలోపే రోగి మొబైల్‌కు ఫలితాలు

ఈ కేంద్రంలో 112 రకాల జబ్బులకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఆయా మండలాలను 4 రూట్లుగా విభజించి 4 వాహనాల్లో ప్రతి రోజు పేషెంట్ల నమూనాలను టీ డయాగ్నోస్టిక్ హబ్‌కు తరలిస్తున్నారు. ఫలితాలను 24 గంటలలోపే ఆన్‌లైన్ విధానం ద్వారా పేషెంట్ మొబైల్‌కు పంపిస్తారు.



భువనగిరిలోని టీ డయాగ్నోస్టిక్ హబ్

అత్యాధునిక పరికరాలతో సేవలు



జిల్లా కేంద్రంలో ఉన్న టీ డయాగ్నోస్టిక్ హబ్ అత్యాధునిక పరికరాలతో సేవలందిస్తోంది. ఫలితాలు 24 గంటలోపే పేషెంట్ మొబైల్‌కు చేరవేయబడుతుంది. నమూనాలు తీసుకువచ్చేందుకు నాలుగు వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ చిన్ననాయక్, డీసీహెచ్ఎస్

కొత్త పింఛన్లు వచ్చేదెప్పుడో..



- పింఛన్ల మంజూరుపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రాని ప్రకటన
- ప్రతి నెలా వందల మంది దరఖాస్తు
- విచారణ చేసి, అర్జీలను పక్కన పెడుతున్న అధికారులు
- ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

భువనగిరిటౌన్: ఆసరా పింఛన్ల కోసం కొత్తగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పేరును 'చేయూత'గా మార్చింది. ఇప్పటివరకు పింఛన్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు రాకపోవడంతో ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండున్నరేళ్లుగా చాలామంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ పూర్తయినప్పటికీ వివరాలను ఆన్‌లైన్ చేసే అవకాశం కూడా ప్రస్తుతం లేకుండా పోయింది. ప్రతి నెలా వందల మంది దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ మంజూరు మాత్రం అగమ్యగోచరంగా మారింది.

పెండింగ్‌లోనే దరఖాస్తులు..

జిల్లాలో 1,02,575 మంది పింఛన్ పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా రూ.27.19 కోట్లు పంపిణీ చేస్తున్నారు. గతంలో ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేసే విధానం అమల్లో ఉండేది. రెండున్నరేళ్లుగా ఆ ఊసే లేకుండా పోయింది. ప్రతినెలా అర్హులు దరఖాస్తు చేసుకుంటున్నారు. సంబంధిత విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు విచారణ చేసి, అర్జీలను పక్కన పెడుతున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియను ఆపేయడంతో, దరఖాస్తుదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆగస్టు 1 నుంచి నూతన పింఛన్ ప్రక్రియ చేపడుతామని చెప్పినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గతంలో విచారణ పూర్తయిన, ప్రజాపాలనలో వచ్చిన వేలాది దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

పింఛన్ రావడం లేదు



నా భర్త సెప్టెంబర్ 2020లో చనిపోయాడు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. ఇంతవరకు మంజూరు చేయలేదు. నా వయసు 68 సంవత్సరాలు. కనీసం వృద్ధాప్య పింఛన్ అయినా మంజూరు చేయాలి.

– బొమ్మరపు లక్ష్మి, తాజ్‌పూర్, భువనగిరి మండలం

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా



రోడ్డు ప్రమాదంలో మెడకు దెబ్బ తగిలి స్పర్శ కోల్పోయా. నా సొంత పని కూడా చేసుకోలేకపోతున్నా. దివ్యాంగుల పింఛన్ కోసం మూడు సంవత్సరాల నుంచి అధికారులు చుట్టూ తిరుగుతున్నా. ప్రభుత్వం ఏర్పాటు జరిగి నాలుగు నెలలు గడిచినా పింఛన్ మంజూరు కాలేదు.

– వెంకన్న, బొడ్డుగూడెం, అడ్డగూడూరు మండలం

బదిలీలు ప్రారంభం



బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్

- తొలిరోజు 55 మంది బదిలీ
- 12 శాఖలకు సంబంధించి కౌన్సిలింగ్ పూర్తి
- 18న మరో ఐదు శాఖల కౌన్సిలింగ్
- బదిలీ కానున్న 262 మంది ప్రభుత్వ ఉద్యోగులు

సాక్షి, యాదాద్రి: సుదీర్ఘ కాలం ఒకే చోట పనిచేస్తున్న వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈనెల 20వరకు బదిలీ ప్రక్రియ కొనసాగనుంది. ఇందులో భాగంగా జిల్లా పరిధిలో ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ ప్రారంభమైంది. 12 శాఖల నుంచి అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ కేడర్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశాల ప్రకారం మంగళవారం అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. మరో ఐదు శాఖల (రెవెన్యూ, పంచాయతీరాజ్, డీటీఓ, ఎస్సీ వెల్ఫేర్, ఇంటర్మీడియట్) ఉద్యోగుల బదిలీలు ఈనెల 18న జరగనున్నాయి.

జిల్లాలో 262 మంది బదిలీ

నాలుగు సంవత్సరాలు ఒకే చోట పనిచేసిన వారిని తప్పకుండా, రెండు సంవత్సరాలు పనిచేసిన వారి ఐచ్ఛికంగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈనెల 20 లోపు అన్ని ప్రభుత్వ శాఖల్లో జిల్లా స్థాయి, జోనల్, మల్టిజోనల్ స్థాయిల్లో బదిలీలు పూర్తి చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే జిల్లా స్థాయిలో 262 మంది 17 శాఖల ఉద్యోగులు కోరుకున్న చోటుకు ఇచ్చిన ఆప్షన్ ఆధారంగా బదిలీలు చేస్తున్నారు.

తొలిరోజున 55 మంది బదిలీ

ఉద్యోగులు ఇచ్చిన ఆప్షన్ ఆధారంగా జిల్లాలో తొలిరోజున 55 మందిని బదిలీ చేశారు. ట్రెజరీ-5, వ్యవసాయ శాఖ-5, విద్యాశాఖ-5, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ -2, పశుసంవర్ధక శాఖ -8, మెడికల్ అండ్ హెల్త్-5, గిరిజన సంక్షేమ శాఖ-5, సహకార శాఖ -1, ఆర్‌అండ్‌బీ-8, బీసీ సంక్షేమ శాఖ-8, ఐసీడీఎస్-2, మార్కెటింగ్ శాఖలో 1 బదిలీలు జరిగాయి. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్‌లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్‌మోహన్ ప్రసాద్, గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు భగత్, ఎండీ ఖదీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో 105 మంది

జిల్లా పంచాయతీ రాజ్ విభాగంలో 105 మంది అత్యధికంగా బదిలీ కానున్నారు. రెవెన్యూ శాఖలో డీటీలు, సీనియర్ అసిస్టెంట్‌లు, అటెండర్లు సుమారు 40 మంది బదిలీ కానున్నారు. ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు, భువనగిరి ఎంపీఓలు జిల్లాలోని ఇతర మండలాలకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇక.. పంచాయతీరాజ్ ఇంజనీర్లు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, అటెండర్లు కూడా బదిలీ కానున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే కొనసాగనున్నారు.

వ్యతిరేకిస్తున్న అర్చకులు

ఆలయాల్లో ఈఓలు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, అర్చకుల బదిలీలకు కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిని అర్చకులు వ్యతిరేకిస్తున్నారు. ఎండోమెంట్ యాక్టు ప్రకారం అర్చకులు ఆయా ఆలయాల సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీరిని బదిలీ చేయడం ద్వారా సంప్రదాయ పూజలకు విఘాతం కలుగుతుందన్న భావన అర్చకుల్లో వ్యక్తమవుతోంది. అయితే దేవస్థానం ఉద్యోగులు బదిలీ కాకుండా ఒక చోట పనిచేసే విధంగా గతంలో సింగిల్ యూనిట్ జీఓ ఉంది. దీని ప్రకారం ఏ దేవస్థానంలో పనిచేసే అక్కడే విధులు నిర్వహించే విధంగా వెసులుబాటు కల్పించింది. దీంతో ఉద్యోగులు చాలా కాలంగా యాదాద్రి, ఇతర దేవస్థానాల్లోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆ జీఓ ప్రకారం తమను ఇక్కడే కొనసాగించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈమేరకు అర్చకులు ప్రభుత్వ పెద్దలను కలిశారు. వీరితోపాటు దేవాదాయ శాఖ ఉద్యోగులు సైతం బదిలీలను వ్యతిరేకిస్తున్నారు.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం



డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవ్వారం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలో గల తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్‌కు అప్టిమస్ డ్రగ్స్ అండ్ ఫార్మా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో అందజేసిన వైద్య పరికరాలనుహాయన ప్రారంభించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్, నవజాత శిశు కేంద్రాలను పరిశీలించారు. డయాలసిస్ కేంద్రంలో అదనంగా మరో 3 బెడ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి రోజు సుమారు 50 మంది వరకు డయాలసిస్ చేసుకునే సదుపాయం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. ఆస్పత్రిలో రెండు ఆర్‌ఓ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చిన్న నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, అనిఫ్ తదతరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రోచ్ఛరణాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీ ఆంజనేయస్వామికి అభిషేకం, నాగవల్లీ దళాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

• సీఎం మీటింగ్‌లో కలెక్టర్



రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే.జెండగే

మిర్యాలగూడలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్ ఎత్తివేత



మిర్యాలగూడలోని నిలిపిన రైళ్లు

మిర్యాలగూడ : సికింద్రాబాద్ – గుంటూరు మార్గంలో ప్రయాణించే విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్‌లో ఈనెల 19నుంచి స్టాప్‌ను ఎత్తివేస్తూ రైల్వే శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఈ రైళ్లకు స్టాప్ ఎత్తివేయగా రెండేండ్ల పాటు ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. మాజీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మిర్యాలగూడలో రైళ్లను నిలపాలంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జూలై నుంచి ఆయా రైళ్లకు మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్లలో ఒక నిమిషం పాటు నిలిచేలా అనుమతించారు. ఆదేశాలు ఇచ్చిన సమయంలోనే ఏడాది పాటు రైళ్ల నిలుపుతామని ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రస్తుతం ఏడాది సమయం పూర్తయింది. దీంతో ఈనెల 19నుంచి ఆయా స్టాప్‌లను అధికారులు తొలగించారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు ప్రయాణికులు ఈ మార్గంలో ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు నిత్యం వెళ్లి వస్తుంటారు. రైల్వే అధికారుల నిర్ణయంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మిర్యాలగూడలో రైళ్లు నిలిపేలా కృషి చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు మాతం ప్రదర్శన

భువనగిరిటౌన్: భువనగిరి షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో బుధవారం మాతం ప్రదర్శన నిర్వహించనున్నట్లు షియా ముస్లిం సంఘం అధ్యక్షుడు రాజాహుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న సమయంలో జంప్కానాగూడెంలోని హజ్రత్ అబ్బాస్ పీర్ల చావడి నుంచి ఖాజీ మోహిల్లా బీబీకా ఆలం ఆషూర్ ఖానా వరకు, అదే రోజు రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చౌరస్తాలోని కార్బలా మైదానం (సోయే పీర్ దర్గా) నుంచి దర్గా కమాన్ వద్ద ఉన్న షహజాదే ఖాసీం పీర్ల చావడి వరకు మాతం ప్రదర్శన కొనసాగనుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లిం సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్, కార్యదర్శి కల్బే హుస్సేన్, ప్రతినిధులు లాయక్ అలి, తఖీ హుస్సేన్, హైదర్ అలీ, అస్గర్ అహ్మద్, సజ్జాద్ హుస్సేన్, అఘా మెహిది, అద్నాన్ పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

కేతేపల్లి: ఒరిస్సా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ముఠాను మంగళవారం కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. నిందితుల నుంచి దాదాపు 60కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మంగళవారం ఉదయం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులు విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా.. గంజాయి పట్టుబడిందని, కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి సమక్షంలో ఘటనా స్థలం వద్దనే పంచనామా నిర్వహించి పట్టుబడిన గంజాయిని, నిందితులను పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో వివరించనున్నట్లు తెలిసింది.

పీడీఎస్ బియ్యం కేసులో ఒకరి అరెస్ట్

కోదాడరూరల్: పీడీఎస్ బియ్యం కేసులో పరారీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన పసుపు నర్సింహారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు. కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు శివారులో ఈ నెల 7వ తేదీన పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న సాంబశివరావు అనే వ్యక్తిని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అతడు ఆ పీడీఎస్ బియ్యాన్ని ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి తరలిస్తున్నాడని తెలుసుకుని మరుసటి రోజు అక్కడ బియ్యం వ్యాపారం చేస్తున్న పసుపు నర్సింహారావు డంపింగ్ కేంద్రంపై దాడులు చేయగా 640 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నర్సింహారావు కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్ రోడ్ వద్ద కనిపించడంతో అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ ఎం. అనిల్‌రెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యం

నిడమనూరు: మండలంలోని మార్లగడ్డతండాకు చెందిన యువకుడు అదృశ్యమైనట్లు మంగళవారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మార్లగడ్డతండాకు చెందిన సబావత్ నరేందర్ తల్లిదండ్రులు అతడి చిన్నప్పుడే మృతిచెందారు. మూడు నెలల క్రితం త్రిపురారం మండలం డొంకతండాకు చెందిన ధనావత్ నందినిని నరేందర్ వివాహం చేసుకున్నాడు. వివాహం తర్వాత ఇద్దరూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. నెల రోజుల క్రితం దంపతులిద్దరూ గొడవపడి ఇద్దరూ మార్లగడ్డకు వచ్చారు. ఈ నెల 13వ తేదీన నరేందర్ యాక్టీవాపై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో రెండురోజుల తర్వాత అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. ఎంత వెతికినా నరేందర్ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం అతడి పెద్దనాన్న మంగ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చింతపల్లి : కారు అదుపుతప్పి బొల్తా కొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. దేవరకొండ వైపు నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న ఓ కారు మండలంలోని పోలేపల్లి రాంనగర్ వద్ద బొల్తా కొట్టింది. దీంతో కారులో ఉన్న మల్లేష్, అక్రం, చంద్రశేఖర్, యాదమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి.

బహిరంగ ప్రకటన

Vemula Tirupathamma, W/o. Vemula Srinivas, R/o. H.No. 1-1, Beerappa Gadda, Alair Village and Mandal, Yadadri Bhuvanagiri District.

షెడ్యూల్: Residential Zone in Survey No. 859/a & 859, Block No. 10th, Open Plot Bearing No. 14, Extent an area in Sq. Yards 200 (equivalents to Sq. Meters: 167.22) Situated at: Mothkur village under Municipality, Mothkur Mandal, yadadri Bhuvanagiri District. Rev. Mandal: Mothkur, Dist: Yadadri Bhuvanagiri Telangana State, M.P.P. Mothkur, Z.P.P Yadadri Bhuvanagiri, S.R.O Mothkur, Regn District Nalgonda. తూర్పు : 25' Feets Road, పడమర : Plot No. 41, ఉత్తరం : Plot No. 16 & 15, దక్షిణం : Plot No. 13.

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B. Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON, Dist: Jangaon, Cell: 9848430926

యువకులపై దాడి.. ఒకరికి కత్తిపోట్లు

- మిర్యాలగూడ పట్టణంలో ఘటన

మిర్యాలగూడ అర్బన్: ఇద్దరు యువకులు తమ ఇంటి ముందు కూర్చోని మాట్లాడుకుంటుండగా ఆ ఇంటి ఎదురుగా నివసిస్తున్న వారు అకారణంగా యువకులపై దాడి చేశారు. ఈ దాడిలో ఆ యువకుల్లో ఒకరు కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. తాళ్లగడ్డ కాలనీకి చెందిన గుడిసె వెంకటేశ్వర్లు కుమారుడు గుడిసె అశోక్, అల్లుడు దోటి రమేష్ సోమవారం రాత్రి తమ ఇంటి ముందు కూర్చోని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో వారి ఇంటి ఎదురుగా నివసిస్తున్న చింతకాయల రఘు వారి వద్దకు వచ్చి అకారణంగా దుర్భాషలాడుతూ దోటి రమేష్‌ను కొట్టగా.. అశోక్ అడ్డుకున్నాడు. ఆ తర్వాత అశోక్, రమేష్ ఇంట్లోకి వెళ్లారు. ఇంతలో రఘు అతడి ఇంట్లోకి వెళ్లి చింతకాయల రాకేష్, సారగుండ్ల మహేష్, తగుల్ల మహేష్, చింతకాయల సైదమ్మ, కుందేళ్ల లక్ష్మమ్మ, సారగుండ్ల ఎల్లమ్మను తీసుకొచ్చి అశోక్, రమేష్‌ను ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి విచక్షణారహితంగా కొట్టారు. వారి వెంట తెచ్చుకున్న కత్తితో అశోక్‌ను పొడిచారు. భయభ్రాంతులకు గురైన రమేష్ కుటుంబ సభ్యులు పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అశోక్‌ను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులకు గుడిసె వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న అశోక్

'కేవీకే' సేవలు రైతులకు చాలా అవసరం

- నల్లగొండ జిల్లా కోర్టు జడ్జి నాగరాజు

గరిడేపల్లి : కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సేవలు జిల్లా రైతాంగానికి చాలా అవసరమని నల్లగొండ జిల్లా కోర్టు జడ్జి ఎం.నాగరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లిలో 96వ జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐకార్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు కొత్త వంగడాలు, సాంకేతికతను వివరించాలని అన్నారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్తలు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 16న జరుపుకుంటారని, ఈ ఏడాది నుంచి ఫౌండేషన్ అండ్ టెక్నాలజీ డేగా పాటించాలని ఐకార్ నిర్ణయించిందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తి, నాణ్యత, రైతుల ఆదాయాన్ని పెంచడానికి గాను వివిధ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ పరిశోధన సంస్థలు అభివృద్ధి చేసిన అద్భుతమైన సాంకేతికతలను, రకాలను కేవీకేల నుంచి చేరవేయడం ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. తదుపరి కేవీకేలోని వివిధ ఉత్పత్తులను ప్రదర్శనలో ఏర్పాటు చేసి రైతులకు చూపించారు. ఇందులో వివిధ వరి విత్తనాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, వర్మికంపోస్టు, అజోల్లా, జీవన ఎరువులు, పుట్టగొడుగులు, పట్టు పురుగులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్ నరేష్, ఎ.కిరణ్, టి.మాధురి, కేవీకే సిబ్బంది నరేష్, వ్యవసాయ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా జడ్జి నాగరాజు

ఆపదలో ఉన్నా.. ఆదుకోండి..

- ఓ సామాజిక సేవకుడి వేడుకోలు

చిలుకూరు : ఆపదలో ఉన్నా.. తనను ఆదుకోండి అంటూ ఓ సామాజిక సేవకుడు పలు సామాజిక మాధ్యమాల ద్వారా వేడుకుంటున్నాడు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రానికి చెందిన యువకుడు కస్తూరి సురేష్ దశాబ్దకాలంగా హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్, మెగా బ్లడ్‌డోనేషన్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అత్యవసరమైన వారికి రక్తదానం చేయడంతో పాటు ఆర్థికసాయాలు చేయడం, చేయించడం లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టాడు. ఇప్పుడు అతడికే ఆపద వచ్చింది. సురేష్‌కు ఆకస్మికంగా గుండెనొప్పి రావడంతో అతడి కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చికిత్సకు రూ.4లక్షలకు పైగా ఖర్చు అవుతుందని తెలిపారు. సామాన్య కుటుంబానికి చెందిన సురేష్ అంత ఖర్చు భరించే పరిస్థితిలో లేకపోవడంతో ఆర్థికసాయం కోసం సామాజిక మాధ్యమాల్లో వేడుకుంటున్నాడు. దాతలు ముందుకు వచ్చి తమ వైద్య ఖర్చుల నిమిత్తం సాయం అందించాలని కోరుతున్నాడు. ఎంతో మందికి ఆర్థికసాయం చేసి, చేయించిన సురేష్‌ను ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు సైతం కోరుతున్నారు. ఆర్థికసాయం చేయదలిచిన వారు 83330 61345కు ఫోన్ చేయాలని బాధితుడు సురేష్ వేడుకుంటున్నాడు.


చిక్సిత పొందుతున్న కస్తూరి సురేష్

నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటపల్లి గ్రామానికి చెందిన పిండ్రాతి నాగేశ్వరరావు, శ్రీరంగం దుర్గారావు తమ కిరాణా దుకాణాల్లో నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్ల విలువ రూ.6వేలు ఉంటుందని పేర్కొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న వారి నివాసాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన పందిరి శ్రీనివాస్, నర్సింహ, రాజు గుట్కా విక్రయాలు సాగిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి షాపులు, నివాసాలపై దాడి చేసి రూ.11 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.


మఠంపల్లి : చౌటపల్లిలోని కిరాణ దుకాణంలో గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్ కోర్టు జడ్జి ఎస్. రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండల పరిధిలోని దుబ్బగూడేనికి చెందిన చిత్తలూరు మల్లయ్య వ్యవసాయ కూలీ పనులతో పాటు గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తన భార్యకు, అదే గ్రామానికి చెందిన బచ్చలకూరి అనిల్(22)కు వివాహేతర సంబంధం ఉందని మల్లయ్యకు అనుమానం వచ్చింది. దీంతో 2016 డిసెంబర్ 22వ తేదీన మల్లయ్య అనిల్‌పై కల్లు గీసే కత్తితో దాడి చేశాడు. దాడిలో అనిల్ మృతిచెందాడు. అనిల్ తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మల్లయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మంగళవారం ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్ జడ్జి రోజారమణి నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో నాలుగు నెలలు జైలు శిక్ష విధించాలని తీర్పునిచ్చారు.

సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందంజ


సమావేశంలో మాట్లాడుతున్న శరత్ చౌదరి

భువనగిరి : సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉంటుందని డిస్ట్రిక్ట్ గవర్నర్ 3150 శరత్‌చౌదరి అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని న్యూవివేరా హోటల్‌లో జరిగిన రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి 24 ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో అనేక కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా పోలియో మందును అందించిన ఘనత ఉందన్నారు. అంతకు ముందు క్లబ్ నూతన అధ్యక్షుడిగా కరిపె నర్సింగ్‌రావు, సభ్యులతో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అనారోగ్యానికి గురైన తోటకూరి బీరప్పకు రూ.20వేల ఆర్థికసాయంతో పాటు 6వ తరగతి విద్యార్థి హిమబిందుకు సైకిల్‌ను అందజేశారు. అలాగే 20మందికి పోస్టల్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ నర్సింహాయాదవ్, అసిస్టెంట్ గవర్నర్ యంపల్ల వెంకట్‌రెడ్డి, తిరునగరి రంగయ్య, బుచ్చిరెడ్డి, శెట్టి బాలయ్యయాదవ్, మాజీ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, పైళ్ల లింగారెడ్డి, జ్ఞానప్రకాష్‌రెడ్డి, బండారు శ్రీనివాస్‌రావు, నిమ్మయ్య, చెన్న లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం.. డ్రైవర్ మృతి

మోతె: లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మోతె మండల కేంద్రంలో సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడి మండలం గోనెడ గ్రామానికి చెందిన నల్లెం శెట్టిఏప్రిం(30) డీసీఎంపై మంగళవారం ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వెళ్తూ మోతె మండల కేంద్రంలో సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై కర్రల లోడుతో ఆగి ఉన్న లారీకి వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో శెట్టిఏప్రింకు కర్రలు కుచ్చుకొని తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. డీసీఎం, లారీ మధ్యలో ఇరుక్కుపోయిన శెట్టిఏప్రింను పోలీసులు అతికష్టం మీద బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

తాగిన మైకంలో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం


రాజయ్య (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: తాగిన మైకంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో సోమవారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం అక్కంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన భాషిపాక రాజయ్య(32) దేవరకొండలోని ఓ కళాశాలలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. రాజయ్య గత కొద్దిరోజులుగా మద్యానికి బానిస కాగా.. సోమవారం తన భార్య నాగమణితో గొడవపడ్డాడు. దీంతో ఆమె పక్కనే ఉన్న తన బంధువుల ఇంట్లో నిద్రించింది. మంగళశారం ఉదయం భార్య నిద్రలేచి ఇంటికి వచ్చి చూడగా చీరతో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో భార్య కేకలు వేయగా చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూడగా అప్పటికే రాజయ్య మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దెల సందీప్‌కు సదాశివుడు స్మారక పురస్కారం


సందీప్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండలంలోని గుండెపురి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ గాయకుడు మద్దెల సందీప్ గోదావరి గొంతుక సదాశివుడు స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ప్రజా కవులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

సూర్యాపేటటౌన్: భార్య మందలించిందని ఉరేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన కొల్లూరి కృష్ణయ్య(40) గత ఐదేళ్లుగా మద్యానికి బానిసై రోజూ ఇంటికి మద్యం తాగి వస్తున్నాడు. సోమవారం రాత్రి కూడా కృష్ణయ్య మద్యం తాగి ఇంటికి రాగా.. 'ఎందుకు ప్రతిరోజు తాగి వస్తున్నావు' అని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కృష్ణయ్య భార్యను ఇంట్లో ఉంచి గడియ పెట్టి ఇంటి ముందు వరండాలో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన అతడి భార్య గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి కృష్ణయ్యను హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూర్‌నగర్ : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటన మంగళవారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేములూరి వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు గ్రామశివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు, ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్లు మీసాల మట్టయ్య, మచ్చ రవిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడే మొహర్రం

- దట్టీలు, పూల చాదర్‌ల కొనుగోళ్లతో దుకాణాల్లో సందడి


భువనగిరిలో చాదర్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

భువనగిరి టౌన్: ముస్లింల ప్రధాన పర్వదినాల్లో మొహర్రం ముఖ్యమైనది. ముస్లింలంతా ఈ పండుగను బుధవారం జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. అరబిక్ క్యాలెండర్ ప్రకారం మొహర్రం నుంచి నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. పండుగను పది రోజులపాటు జరుపుకుంటారు. పీర్ అంటే మహాత్ములు, ధర్మ నిర్దేశకులు అని అర్థం. ధర్మయుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారికి చిహ్నంగా ఈ పండుగను జరుపుకుంటారు. మొహర్రం నెలలో పది రోజులపాటు అమరులను స్మరించుకుంటూ పదో రోజును అషుర దినంగా జరుపుకోవడం ఆనవాయితీ.

రెండ్రోజులపాటు ఉపవాసం

రంజాన్ ఉపవాసాల తర్వాత అంతటి నియమ నిష్టలు, కఠినమైన ఉపవాసాలను మొహర్రం సందర్భంగా పాటిస్తారు. తొమ్మిదో రోజు, పదో రోజు వీలుపడని వారు, పదో రోజు, 11వ రోజు ఉపవాసాలను పాటిస్తారు. ఈ ఉపవాసాలను పాటిస్తే ఒక ఏడాదిపాటు చేసిన పాపాలు మన్నించబడతాయని ముస్లింలు విశ్వసిస్తారు.

కొనుగోళ్ల సందడి

మొహర్రం పండుగ నేపథ్యంలో యాదాద్రి జిల్లా వ్యాప్తంగా ప్రజలు తమ మొక్కులు తీర్చుకునేందుకు వివిధ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. వివిధ దుకాణాల్లో దట్టీలు, కుడకలు, బెల్లంతో పాటు పూల చాదర్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో భువనగిరి పట్టణంలోని దుకాణాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఆలయానికి 50క్వింటాళ్ల సమిధల బహూకరణ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ప్రతి రోజు నిర్వహించే శ్రీసుదర్శన నారసింహ హోమానికి వినియోగించేందుకు 50క్వింటాళ్ల సమిధలను టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ మెంబర్ వడ్లోజు వెంకటేష్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని నిత్యం హోమంలో సమర్పించే మర్రి, రాగి, మోదుగు, మామిడి, మేడి, జువ్వి, సండ్ర వంటి సమిదలను ఆలయానికి బహూకరించినట్లు వెల్లడించారు. అంతకు ముందు ఆలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరున ప్రత్యేక పూజలు చేసి, మంత్రి పదవి వచ్చేలా దీవించాలని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.


ఆలయాధికారికి 50క్వింటాళ్ల సమిధలను అందజేస్తున్న వడ్లోజు వెంకటేష్

ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డులకు ఎంపిక


మనోజ్‌కుమార్‌రెడ్డి


ఉదయ్‌కుమార్‌రెడ్డి

మోత్కూరు : మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన రాజమాత ఫౌండేషన్ వ్యవస్థాపక నిర్వాహకులు ఎ.మనోజ్‌రెడ్డి, ఎ.ఉదయ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీకి చెందిన ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డుకు ఎంపికయ్యారు. మోత్కూరు ప్రాంతంలో పలు పాఠశాలల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలకు, పేదలకు అందిస్తున్న సహాయాలు, అనాథ పిల్లలకు చేస్తున్న సేవలను గుర్తించి తమకు ఢిల్లీకి చెందిన నేషనల్ హ్యూమన్ కౌన్సిల్ వారు ఈ అవార్డును ప్రకటించినట్లు వారు వెల్లడించారు. ఈనెల 19న ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందుకోనున్నట్లు తెలిపారు.

నెమ్మికల్ జూనియర్ కళాశాలలో నిధుల గోల్‌మాల్..?

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని నెమ్మికల్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలు కల్పన కోసం ప్రభుత్వం అందజేసిన నిధుల్లో గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. 2016–17 విద్యాసంవత్సరంలో నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం నుంచి సుమారు రూ.4లక్షలు రాగా.. ఆ నిధులను ఖర్చు చేయకుండా నెమ్మికల్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)కి బదలాయించి కళాశాలకు సంబంధించిన వ్యక్తి పేరున రూ.3లక్షలు చెక్కు ద్వారా డ్రా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టినా ఏ ఒక్క అధికారి కూడా తప్పును ఒప్పుకోవడం లేదని సమాచారం. ఈ విషయమై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈఓ) కృష్ణయ్యను వివరణ కోరగా.. నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని, మరో వారం రోజుల్లో కారకులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


సైదులు (ఫైల్)

నాగారం: మండలంలోని ఫణిగిరి స్టేజీ వద్ద సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామానికి చెందిన బైరబోయిన సైదులు(43) పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా పాలు తెచ్చేందుకు మంగళవారం తన టాటా ఏస్ వాహనంలో జనగామకు బయల్దేరాడు. మార్గమధ్యలో నాగారం మండలం ఫణిగిరి వద్దకు రాగానే ఎదురుగా ఆగి ఉన్న లారీ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సైదులు రెండు కాళ్లు విరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. వెంకట్‌రెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయినిపాలెం గ్రామ శివారులోని చిట్టబోయిన శ్రీను వ్యవసాయ పొలంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.2000 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ





హైదరాబాద్‌తో పాటు ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు మంగళవారం జాజిరెడ్డిగూడెం వద్ద మూసీనది ఉధృతంగా ప్రవహిస్తుంది. నదివెంట ఉన్న గ్రామాల రైతుల పంటలకు, తాగునీటికి ఎలాంటి కొరత ఉండదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నది ప్రవాహంతో సమీప గ్రామాల మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. నదిలో నీటిమట్టం పెరిగినందున రైతులు, ప్రజలు నదిలోకి వెళ్లవద్దని నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరించారు. – అర్వపల్లి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

EDUCATION

■ స్టెల్లా కాలేజ్ (ఉమెన్స్) విజయవాడలో B.Sc. ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / AI & ML / మెడికల్ ఇమేజింగ్ (రేడియాలజీ); BBA - 3 సం॥ల కోర్సులు. అర్హత : ఇంటర్. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. హాస్టల్ కలదు. సంప్ర : 84658 74867, 99121 78237 [V- 2624]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185351]

ప్రకటన కొంతే! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.